డాక్టర్ కారులో గంజాయి
సాధారణ వాహన తనిఖీల్లో దొరికిన వైనం
వికారాబాద్ పట్టణంలో ఘటన
కేసు నమోదు చేసిన పోలీసులు
కావాలనే ఇరికించారన్న సదరు వైద్యుడు
7


పనులను పరిశీలిస్తున్న ఎస్ఈ చెన్నారావు, ఈఈ ప్రభాకర్‌రెడ్డి

పనులు నాణ్యతగా చేపట్టాలి

» స్టేట్ పబ్లిక్ హెల్త్ ఎస్ఈ చెన్నారావు

తాండూరు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పనులను నాణ్యతగా చేపట్టాలని రాష్ట్ర పబ్లిక్ హెల్త్ ఎస్ఈ చెన్నారావు అధికారులకు సూచించారు. బుధవారం ఆయన తాండూరు పట్టణంలో రూ. 45 కోట్ల వ్యయంతో చేపడుతున్న పలు అభివృద్ధి పనులను ఈఈ ప్రభాకర్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. చిలుక వాగు డ్రెయిన్, ఆదర్శ నగర్ మురుగు కాల్వ, అమృత్ 2.0 తాగు నీటి పనులను ఆయన పరిశీలించారు. పనుల ప్రగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆయన పబ్లిక్ హెల్త్ అధికారులను ఆదేశించారు. అలాగే ఎన్‌టీఆర్ కాలనీలో నిర్మిస్తున్న ట్యాంక్ నిర్మాణ పనులు, టీఎ‌ప్ఐడీసీ కింద చేపడుతున్న పనులను పరిశీలించారు. ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా గడువులోగా పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు. ఆదర్శ నగర్ వద్ద చేపట్టే డ్రైన్ విషయంలో వివాదాస్పద స్థల యజమాని రంగారావు అక్కడకు వచ్చి తమ స్థలంలో డ్రెయిన్ నిర్మించకుండా చూడాలని ఉన్నతాధికారులను కోరారు. ఎవరికి ఎలాంటి నష్టం జరుగకుండా నిబంధనల మేరకు నిర్మాణం పనులు చేపడుతామని ఆయనకు అధికారులు నచ్చ చెప్పారు. ఈయన వెంట పబ్లిక్ హెల్త్ శాఖ ఏఈ సాజిద్, మున్సిపల్ అధికారులు ఉన్నారు.


ధ్రువ పత్రాలను అందజేస్తున్న ఒబేదుల్లా కొత్వాల్, ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరులో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్

» మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా

తాండూరు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): మైనార్టీల అభివృద్ధి కోసం రూ. 30 లక్షల వ్యయంతో తాండూరులో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేయనున్నట్లు మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్ తెలిపారు. బుధవారం ఆయన తాండూరు మున్సిపల్ కార్యాలయ ఆవరణలో కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కుట్టు మిషన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం మైనార్టీలను పట్టించుకోలేదన్నారు. ప్రస్తుతం రేవంత్‌రెడ్డి ప్రభుత్వంలో మైనార్టీల కోసం ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పారు. మహిళల స్వయం ఉపాధి కోసం టైలరింగ్ శిక్షణ ఇవ్వడంతో పాటు కుట్టు మిషన్లు కూడా పంపిణీ చేస్తున్నామన్నారు. తాండూరు నియోజకవరానికి అదనంగా కుట్టు మిషన్లు మంజూరు చేస్తామని తెలిపారు. ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ అభివృద్ధిలో నియోజవర్గ రూపురేఖలను మారుస్తానని చెప్పారు. తాండూరులో మహిళలకు నైపుణ్యం కోసం ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో మైనార్టీ కార్పొరేషన్ పీడీ రాజేశ్వరి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ధారాసింగ్, మార్కెట్ కమిటీ చైర్మన్ బాల్‌రెడ్డి, ఇన్‌చార్జి కమిషనర్ విక్రం సింహారెడ్డి, మేనేజర్ నరేందర్‌రెడ్డి, నాయకులు అబ్దుల్ రవూఫ్, పట్లోళ్ల నర్సింలు, హబీబ్ లాల, తదితరులు పాల్గొన్నారు.

పీఈసెట్‌లో గురుకుల ఆర్మీ కళాశాల విద్యార్థినికి స్టేట్ 10వ ర్యాంక్


సాయి వర్షిత

ఘట్‌కేసర్ రూరల్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): పీఈసెట్ (ఫిజికల్ ఎడ్యుకేషన్)-2025 ఫలితాల్లో ఘట్‌కేసర్ మున్సిపాలిటీ, అంకుశాపూర్‌లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల ఆర్మీ కళాశాల(భువనగిరి) విద్యార్థిని సాయివర్షిత స్టేట్-10వ ర్యాంక్ సాధించారు. మంగళవారం విడుదలైన ఫలితాల్లో తమ కళాశాల విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించారని ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీలత బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అలాగే బీ. శిరీష 66వ ర్యాంక్, కె. త్రిష్మ 84వ సాధించారురు. ఉత్తమ ర్యాంక్‌లు సాధించిన విద్యార్థినీలను ప్రిన్సిపాల్‌తో పాటు వైస్ ప్రిన్సిపాల్ రమాదేవి, అధ్యాపకులు అభినందించారు.

లక్ష్యానికి చేరువలో..
ధాన్యం కొనుగోళ్లు

వికారాబాద్ జిల్లాలో టార్గెట్ లక్ష మెట్రిక్ టన్నులు

వికారాబాద్ జిల్లాలో ధాన్యం సేకరణ చివరి దశకు చేరుకుంది. మరో మూడు రోజుల్లో కొనుగోళ్లు ముగియనున్నాయి. లక్ష మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని పౌర సరఫరాల శాఖ అధికారులు లక్ష్యం నిర్దేశించగా ఇప్పటివరకు 92,600 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించారు. కాగా, ఇప్పటివరకు రైతుల ఖాతాల్లో రూ.184 కోట్లు జమ చేశారు. ఇదిలా ఉంటే మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు ముగిశాయి. లక్ష్యం 28,000 మెట్రిక్ టన్నులు కాగా, 16,697 మెట్రిక్ టన్నులు సేకరించారు.



చివరి దశకు చేరుకున్న ధాన్యం సేకరణ
మూడు రోజుల్లో ముగియనున్న కొనుగోళ్లు?
మేడ్చల్ జిల్లాలో ముగిసిన కొనుగోలు ప్రక్రియ
మిల్లర్ల జాప్యంతో చెల్లింపుల్లో ఆలస్యం

జిల్లాల వారీగా ధాన్యం కొనుగోళ్ల వివరాలు

	వికారాబాద్	మేడ్చల్
లక్ష్యం	1,00,000(మెట్రిక్ టన్నులు)	28,000(మెట్రిక్ టన్నులు)
సేకరించింది	92,600	16,697
విక్రయించిన రైతులు	16,253 మంది	3,467 మంది
చెల్లించాల్సిన సొమ్ము	రూ.213.89 కోట్లు	రూ.34.84 కోట్లు
జమ చేసినవి	రూ.184 కోట్లు	రూ.30.87 కోట్లు
డబ్బులు పొందిన రైతులు	15,500 మంది	2,632 మంది
బకాయిలు	రూ.29.89 కోట్లు	రూ.3.97 కోట్లు
ఎదురుచూస్తున్న రైతులు	753 మంది	835 మంది

వికారాబాద్/మేడ్చల్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ధాన్యం కొనుగోళ్ల కోసం ఏర్పాటు చేసిన కేంద్రాలకు ధాన్యం రాకడ తగ్గినా చివరి గింజ సేకరించే వరకు కొనుగోలు కేంద్రాలను కొనసాగించాలన్న ప్రభుత్వ ఆదేశాలతో జిల్లాలో ధాన్యం సేకరణ కేంద్రాలు కొనసాగుతున్నాయి. జిల్లాలో ధాన్యం కొనుగోలు చేసేందుకు జిల్లాలో ఐకేపీ, పీఏసీఎస్, డీసీఎంఎస్, ఎఫ్‌పీవోల ఆధ్వర్యంలో 128 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. మంగళవారం వరకు జిల్లాలో 15,500 మంది రైతుల నుంచి 92,600 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించగలిగారు. ఇందులో దొడ్డు రకం ధాన్యం 84,600 మెట్రిక్ టన్నులు, సన్నరకం 7,900 మెట్రిక్ టన్నులు. జిల్లాలో ధాన్యం సేకరణ ప్రక్రియ మరో మూడు రోజుల పాటు కొనసాగనున్నట్లు తెలుస్తోంది. జిల్లాలో సేకరణ ముగిసే వరకు మూడు వేల మెట్రిక్ టన్నులు సేకరించే అవకాశం ఉందని పౌర సరఫరాల శాఖ

మిగతా 8వ పేజీలో...

బోనస్ డబ్బులకు నివేదిక పంపించాం



జిల్లాలో ఇప్పటి వరకు 16,697 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశాం. రైతుల నుంచి చివరి గింజ వరకు కొనుగోలు చేశాం. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేశాం. సన్నాలకు సంబంధించిన బోనస్ డబ్బుల కోసం ప్రభుత్వానికి నివేదిక పంపించాం.

-సుగుణాబాయి, జిల్లా పౌరసరఫరాల శాఖ మేనేజర్, మేడ్చల్

భరోసా @ రూ.2.57 కోట్లు

» మేడ్చల్ జిల్లాలో రైతుల ఖాతాల్లో జమ



మేడ్చల్, జూన్ 18(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): వానాకాలానికి సంబంధించిన పెట్టుబడి సాయం(రైతు భరోసా) మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లాలో ఇప్పటి వరకు 4,291 మంది రైతుల ఖాతాల్లో రూ.2.57 కోట్లు జమ అయినట్లు కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. విడతల వారీగా రైతుల ఖాతాల్లో నిధులు జమ చేయడం జరుగుతుందన్నారు. రైతు భరోసా నిధులు పెట్టుబడికి ఉపయోగపడతాయన్నారు. వానాకాలం సాగు ప్రారంభానికి ముందే ప్రభుత్వం రైతు భరోసా నిధులు అందించడంపై అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

క్రీడా పాఠశాలల్లో ప్రవేశాలకు ఎంపిక

దుద్యాల/చౌడాపూర్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): 3వ తరగతి ఉత్తీర్ణులైన బాల, బాలికలకు హకీంపేట్, ఆదిలాబాద్, కరీంనగర్‌లో ఉన్న క్రీడా పాఠశాలల్లో ప్రవేశాలకు మండల స్థాయిలో ఎంపికలు నిర్వహించనున్నట్లు ఎంఈవోలు విజయరామారావు, రామ్‌చందర్‌లు తెలిపారు. దుద్యాల మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి ఫిజికల్, మెడికల్ పరీక్షలతో పాటు గేమ్స్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 4వ తరగతి విద్యార్థులు మాత్రమే అర్హులన్నారు. విద్యార్థులు బోనోఫైడ్ సర్టిఫికేట్‌తో హాజరు కావాలని సూచించారు. మరిన్ని వివరాలకు పీడీలు హన్మంతు 9492352203, 8074387234 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి

దౌల్తాబాద్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కళాశాలల్లో చదివిన వారు ఎందరో గొప్ప విజయాలు సాధించారని ఇంటర్మీడియేట్ జిల్లా విద్యాధికారి శంకర్‌నాయక్ అన్నారు. బుధవారం దౌల్తాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ కళాశాలల్లో మెరుగైన విద్యతో పాటు అన్నీ సదుపాయాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. దౌల్తాబాద్ జూనియర్ కళాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నర్సింహారెడ్డి, ఎంఈవో వెంకటస్వామి, హెచ్‌ఎం శ్రీహరిరెడ్డి, ప్రభాకర్, వెంకట్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


హిట్స్ కళాశాల వద్ద రోడ్డుపై పడిన పెద్ద మర్రి చెట్టు

రోడ్డుపై కూలిన భారీ వృక్షం

» తప్పిన పెను ప్రమాదం
» గంటన్నరకు పైగా ట్రాఫిక్ జామ్

వికారాబాద్/పూడూరు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం మారింది. పాలకులు మారారు. కానీ వికారాబాద్ మన్నెగూడ రోడ్డు పరిస్థితి మాత్రం మారడం లేదు. ఇరుకైనా రోడ్డు, ఎప్పుడు కింద పడుతాయో తెలియని చెట్లతో ప్రయాణికులు ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని ప్రయాణిస్తున్నారు. 3 రోజుల క్రితం మన్నెగూడ సమీపంలో కింద పడిన చెట్టును ఢీకొన్న ఓ వాహనదారుడు తీవ్ర గాయాలైన సంఘటన మరువక ముందే బుధవారం మధ్యాహ్నం ఓ మర్రి చెట్టు నడిరోడ్డుపై కూలింది. మన్నెగూడ రోడ్డులోని హిట్స్ కళాశాల సమీపంలో పెద్ద మర్రి చెట్టు గాలికి వేర్లకాడికి ఊడి నడిరోడ్డుపై అడ్డంగా పడింది. ఆ సమయంలో ఏ వాహనం రాక పోవడంతో పెను ప్రమాదం తప్పింది. అయితే చెట్టు రోడ్డుపై పడడంతో కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. చెట్టుపడిన సోషల్ మీడియాలో వైరల్ అయినా కూడా అధికారులు ఎవరూ స్పందించ లేదు. దీంతో స్థానికులే చెట్ల కొమ్మలను విరిచి వాహనాలను ముందుకు పంపించే ప్రయత్నం చేశారు. చివరకు ఇద్దరు కానిస్టేబుల్స్ వచ్చి జేసీబీ సాయంతో చెట్టును పక్కకు తప్పించే పనులు చేపట్టి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. అయితే ఈ దారిలో గతంలో ఇందిరానగర్‌కు చెందిన ఓ కుటుంబం ఆటో ప్రమాదంలో ప్రాణాలు కోల్పోగా,



నారాయణపూర్ సర్పంచ్ సైతం ఈ రోడ్డులోని చెట్టు కొమ్మ విరిగి పడి మృతి చెందారు. ఈ మధ్య కాలంలో అనేక సార్లు చెట్టు కొమ్మలు విరిగి పడ్డ సంఘటనలు సైతం ఉన్నాయి. ఇప్పటికైనా పాలకులు, అధికారులు వికారాబాద్ నుంచి మన్నెగూడ తో పాటు అప్పా వరకు ఉన్న పురాతన చెట్లను తొలగించే చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.


మాట్లాడుతున్న యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ సుబ్బారావు

ఉద్యోగ ఆధారిత నైపుణ్య శిక్షణతో మేలు

స్కిల్స్ యూనివర్సిటీ వీసీ సుబ్బారావు

కొడంగల్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): కొడంగల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం ఉద్యోగ ఆధారిత నైపుణ్య శిక్షణ కార్యక్రమం విజయవంతమైనట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. యంగ్ ఇండియా స్కిల్స్ విశ్వ విద్యాలయం, ప్రభుత్వ డిగ్రీ కళాశాల కొడంగల్ సంయుక్తంగా కళాశాలలో నిర్వహించిన నైపుణ్య శిక్షణ కార్యక్రమంలో 142 మంది ఉద్యోగార్థులు హాజరైనట్లు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా యంగ్ ఇండియా స్కిల్స్ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ వీఎల్‌వీఎస్.సుబ్బారావు, రిజిస్ట్రార్ సుధాకర్, బీఎఫ్‌ఎస్, ఐసీఓఓ సౌమ్య రంజన్ హాజరయ్యారు. వారు మాట్లాడుతూ ఈ రకమైన శిక్షణ మేలన్నారు. బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్, ఇన్సూరెన్స్ కంపెనీలతో పాటు వివిధ లాజిస్టిక్స్ కంపెనీల ప్రతినిధులు హాజరైనట్లు తెలిపారు. అలాగే ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్, ఐడీబీ ఇండస్, లాజిస్టిక్స్ రంగానికి చెందిన ఆమ్నాని హాజరయ్యారు. కార్యక్రమంలో ట్రైనర్ శ్రీనాథ్, వైస్ ప్రిన్సిపాల్ రఫియాఖానమ్, టి.రాంబాబు, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ ఆర్.శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డీఎస్‌వో మోహన్‌బాబు

నాణ్యమైన బియ్యం సరఫరా చేయాలి

బొంరాస్‌పేట్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనానికి నాణ్యమైన బియ్యం సరఫరా చేయాలని జిల్లా పౌర సరఫరాల అధికారి మోహన్‌బాబు సూచించారు. బియ్యంలో పురుగులు వస్తున్నాయని, వాటిని వెంటనే మార్చాలని ఎంఈవో హరిలాల్ కోరారు. ఈ నేపథ్యంలో బుధవారం మోహన్‌బాబు ఎంఈవోతో కలిసి టేకుల్‌గడ్డ తండా పాఠశాలలో బియ్యాన్ని పరిశీలించారు. నాణ్యమైన బియ్యం అందించాలని కోరితే గోదాం సిబ్బంది నిర్లక్ష్యపు సమాధానం ఇస్తున్నారని హెచ్‌ఎం గోపాల్ తెలిపారు. వేసవి సెలవులు ఉండటంతో పాఠశాలల్లో నిల్వ ఉన్న బియ్యం పాడయ్యాయని, వెంటనే మార్చి నాణ్యమైన బియ్యం సరఫరా చేయాలని ఎంఈవో జిల్లా పౌరసరఫరాల అధికారి మోహన్‌బాబు దృష్టికి తీసుకెళ్లారు.

ఏకశిలానగర్ వెంచర్ పరిశీలన

ఓనర్స్‌తో మాట్లాడిన హైడ్రా కమిషనర్ రంగనాథ్


వివరాలు తెలుసుకుంటున్న హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్

ఘట్‌కేసర్ రూరల్, జూన్18(ఆంధ్రజ్యోతి): పోచారం మున్సిపాలిటీ, కొర్రెములలోని ఏకశిలానగర్ వెంచర్‌ను బుధవారం హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ సందర్శించారు. డిప్యూటీ తహసీల్దార్ రాజేందర్‌ను వెంచర్ వివాదం గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్లాట్ ఓనర్స్‌తో మాట్లాడి డాక్యుమెంట్లను పరిశీలించారు. అనంతరం రంగనాథ్ మాట్లాడుతూ వారం రోజుల్లో హర్ష కన్‌స్ట్రక్షన్ యజమానులైన వెంకటేష్, ఏకశిలనగర్ ప్లాట్ల యజమానులతో సమావేశం ఏర్పాటు చేసి చర్చిస్తామన్నారు. ఇరువురి వద్ద ఉన్న డాక్యుమెంట్లు, పూర్తి ఆధారాలతో రావాలని సూచించారు. హైకోర్టు ఉత్తర్వులుంటే న్యాయనిపుణులతో చర్చించి నిర్ణయం తీసుకుంటానని తెలిపారు. వెంచర్‌పై నెలకొన్న వివాదంపై పూర్తి స్థాయిలో పరిశీలిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ కావ్యారెడ్డి, సర్వేయర్ వినయ్, ఏకశిలనగర్ ప్లాట్ ఓనర్స్ తదితరులు పాల్గొన్నారు.

పేదల సొంతింటి కల నిజం చేయడమే లక్ష్యం




ఇళ్ల మంజూరు పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి

పరిగి,జూన్ 18(ఆంధ్రజ్యోతి):పేదల సొంతింటి కల నిజం చేయడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం పరిగి మునిసిపల్ పరిధిలో 299మందికి ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను అందజేశారు. రూ.84లక్షలతో నిర్మించిన బాల సదనం భవనాన్ని.. 2, 3, 11వార్డుల్లో సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ప్రతి ఇంటి నిర్మాణానికి రూ.5లక్షల ఇస్తామని తెలిపారు. ఇప్పటికే రూ.2కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణాలు పూర్తిచేశామని, మరో రూ.25కోట్ల పనులను ప్రారంభిస్తామని చెప్పారు. పరిగి పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో పరిగి, కులకచర్ల మార్కెట్ కమిటీల చైర్మన్‌లు బి.పరశురాంరెడ్డి, బీఎస్.ఆంజనేయులు, తహసీల్దార్ ఎం.ఆనంద్‌రావు, డీసీసీ ఉపాధ్యక్షుడు ఎం.లాల్‌కృష్ణప్రసాద్, బి.భీంరెడ్డి, కార్యదర్శి కె.హన్మంతు ముదిరాజ్, కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు ఇ.కృష్ణ, పార్టీ నాయకులు ఎస్.రామకృష్ణ, అక్బర్ సేఠ్, అయ్యూబ్, వెంకటేశ్ చిన్న నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

మందు పిచికారీతో ఎండిన పంట

● నష్టపోయి బోరుమంటున్న రైతు

చేవెళ్ల, జూన్ 18(ఆంధ్రజ్యోతి): ఆరుగాలం కష్టపడి సాగుచేసిన పంటకు పురుగుల మందు పిచికారీ చేయగా పంట చేతికందే సమయంలో మొక్కలన్నీ వాడుతున్న సంఘటన మండల పరిధి రామన్నగూడలో జరిగింది. బాధిత రైతు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రామన్నగూడకు చెందిన ఎండీ మక్బూల్‌కు 30గుంటల భూమి ఉంది. 20గుంటల్లో బజ్జి మిర్చి మల్చింగ్ విధానం ద్వారా, పది గుంటల్లో టమాట సాగుచేశాడు. రెండు పంటలకు కాత బాగా రావాలని రైతు చేవెళ్లలోని ఫర్టిలైజర్ దుకాణంలో రూ.950 చెల్లించి మందులు తెచ్చి ఈ నెల 14న పంటపై రెండు రకాల మందును ప్రతీ లీటర్ నీటికి 30ఎంఎల్ చొప్పున కలిపి పిచికారి చేశాడు. బుధవారం చూడగా మిర్చి, టమాట మొక్కలు



రామన్నగూడలో వాడుతున్న టమాట, మిరప పంటలు

వాడిపోయాయి. దీంతో రైతు మందులు కొన్న ఫర్టిలైజర్ షాపు యాజమాని వద్దకు వచ్చి మొక్కలను చూపించాడు. మందుల ఓవర్ డోస్ వల్లే మొక్కలు వాడుతున్నాయని షాపు నిర్వాహకుడు అంటున్నాడని రైతు తెలిపాడు. నిజానికి అతడు చెప్పిన మోతాదులోనే మందును నీటిలో కలిపానని, నకిలీ మందు వల్లే మొక్కలు సచ్చిపోతున్నాయని బోరుమంటున్నాడు. వ్యవసాయ అధికారులు తన పంటను పరిశీలించి నష్టపరిహారం ఇప్పించాలని రైతు డిమాండ్ చేశాడు. పంట చేతికొచ్చే సమయంలో పెట్టుబడితో పాటు ఫలసాయం కూడా కోల్పోతున్నానని వాపోయాడు. అధికారులే తనకు న్యాయం చేయాలని కోరాడు. నకిలీ మందులు అమ్ముతున్న వ్యాపారిపై చర్యలు తీసుకొని, రైతులకు నష్టం కలగకుండా చూడాలని రైతు కోరాడు.



పంటలపై రైతు పిచికారీ చేసిన మందులు



ఫర్టిలైజర్ షాపు ఓనర్ ఇచ్చిన రసీదు

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

బషీరాబాద్, మే 18(ఆంధ్రజ్యోతి): ఉచిత కుట్టు మిషన్లతో మహిళలు ఉపాధి పొందుతూ క్రమంగా ఆర్థిక వృద్ధి సాధించాలని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి ఆకాక్షించారు. బుధవారం బషీరాబాద్‌లో ఎస్సీ కార్పొరేషన్(ఎస్ఆర్డీఎస్) ద్వారా మూడు నెలల శిక్షణ పూర్తిచేసుకున్న మహిళలకు 70 కుట్టు మిషన్లు, సర్టిఫికెట్లను ఎమ్మెల్యే అందజేశారు. అనంతరం ఆయన మట్లాడుతూ.. తెలంగాణ అల్ప సంఖ్యాకవర్గాల ఆర్థిక సంస్థ, ఇందిరమ్మ అల్ప సంఖ్యాక మహిళా శక్తి-రేవంత్ అన్నాకా భరోసా పథకం ద్వారా కూడా 18మంది ముస్లిం మహిళలకు కుట్టు మిషన్లను ఇచ్చామన్నారు. మహిళల స్వయం ఉపాధికి తోడ్పాటునందించాలనే ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు సేవా కార్యక్రమాలు చేపడుతున్నాయని గుర్తుచేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ షాహిదాబేగం, ఎంపీడీవో విజయ్‌కుమార్, ఏఎంసీ చైర్మన్ జి.మాధవరెడ్డి, సొసైటీ చైర్మన్ ఎ.వెంకట్‌రాంరెడ్డి, వైస్ చైర్మన్ అజయ్‌ప్రసాద్,మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు జానకి, మాజీ ఎం పీపీ కరుణఅజయ్ ప్రసాద్, కాంగ్రెస్ నాయకులు శంకరప్ప, నర్సింహులుగౌడ్, లక్ష్మణ్‌రావు, శంకర్‌రెడ్డి, శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

తాండూరు: కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమం కోసం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అన్నారు. క్యాంపు కార్యాలయంలో ఉచిత కంది విత్తనాలను రైతులకు అందజేసి మాట్లాడారు. విత్తనాలు అవసరమైన రైతులు రైతు వేదికల్లో అధికారుల వద్ద పొందాలని సూచించారు. ప్రభుత్వం ఎకరానికి రూ.6వేల రైతు భరోసా అందిస్తోందని చెప్పారు. కార్యక్రమంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి ధారాసింగ్, మార్కెట్ కమిటీ చైర్మన్ బాల్‌రెడ్డి, ప్యాక్స్ చైర్మన్లు వెంకట్‌రాంరెడ్డి, సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.



కుట్టు మిషన్ల పంపిణీ కార్యక్రమంలో మట్లాడుతున్న ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి

మేడ్చల్ డిపో నుంచి పుణ్యక్షేత్రాలకు ప్రత్యేక బస్సు సర్వీసు

మేడ్చల్ టౌన్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): పుణ్యక్షేత్రాలను దర్శించుకునే వారి కోసం మేడ్చల్ ఆర్టీసీ డిపో నుంచి ప్రత్యేకంగా బస్సు సర్వీసును ప్రారంభిస్తున్నామని మేడ్చల్ ఆర్టీసీ డిపోమేనేజర్ సుధాకర్ చెప్పారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఈ నెల 27న ఉదయం 5గంటలకు తీర్థ యాత్రల బస్సు డిపో నుంచి బయలుదేరి కాళేశ్వరం, రామప్ప ఆలయం, వరంగల్ భద్రకాళి ఆలయం, వేయి స్తంభాల గుడి దర్శించుకుని తిరిగి భక్తులను మేడ్చల్‌కు తీసుకొస్తుందని తెలిపారు. టికెట్ ధర పెద్దలకు రూ.1,200, పిల్లలకు రూ.700 ఉంటుందన్నారు. మహిళలకు ఉచిత సర్వీసు వర్తించదని చెప్పారు.



మాట్లాడుతున్న డిపో మేనేజర్ సుధాకర్

గెస్ట్ లెక్చరర్ల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

మాడ్గుల, జూన్ 18(ఆంధ్రజ్యోతి): మాడ్గులలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో లెక్చరర్ పోస్టులకు అర్హుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని స్పెషల్ ఆఫీసర్ రేఖ బుధవారం తెలిపారు. జువాలజీ, బాటని, ఫిజిక్స్, మ్యాథమెటిక్స్, తెలుగు, ఇంగ్లిష్ సబ్జెక్టులు బోధించేందుకు అధ్యాపకులు అవసరమన్నారు. అభ్యర్థులు సంబంధిత సబ్జెక్టుల్లో పీజీ, బీఈడీ చేసి ఉండాలని తెలిపారు. జూన్ 30లోపు దరఖాస్తులను పాఠశాలలో అందజేయాలని వివరించారు.

పారిశుధ్యంపై దృష్టి సారించాలి



తుక్కుగూడలో తడి, పొడి చెత్త నిర్వహణపై అవగాహన కల్పిస్తున్న కమిషనర్ వాణి, సిబ్బంది

మహేశ్వరం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీల్లో వంద రోజుల కార్యాచరణ ప్రణాళికలో ప్రజలంతా భాగస్వాములు కావాలని, పరిసరాలను, పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచుకునేందుకు తోడ్పాటు అందించాలని తుక్కుగూడ మున్సిపల్ కమిషనర్ వాణి అన్నారు. వంద రోజుల ప్రణాళికలో భాగంగా బుధవారం ఆయా వారుల్లో తడి, పొడి చెత్త నిర్వహణ, సీజనల్ వ్యాధులపై అవగాహన సదస్సు నిర్వహించారు. రోడ్లపై చెత్త వేసిన పలువురికి జరిమానా విధించారు. అనంతరం అధికారి మాట్లాడుతూ.. ప్రజలు రోజూ తడి, పొడి చెత్తను వేరు చేసి మున్సిపల్ సిబ్బందికి సహకరించాలన్నారు. పరిసరాల పరిశుభ్రతలో ప్రజలు ఎవరికి వారు సామాజిక ఉద్యమంలా భావించి పాలుపంచుకోవాలన్నారు. పరిసరాల పరిశుభ్రతే ప్రజారోగ్యానికి మూలం అన్నారు. ప్రతి వీధిని పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అదే విధంగా సీజనల్ వ్యాధులపైనా ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. 100 రోజుల ప్రణాళికలో తుక్కుగూడ మున్సిపాలిటీని స్వచ్ఛ మున్సిపాలిటీగా తీర్చి దిద్దుదామని, అందుకు పట్టణ పరిధి ప్రజలు సహకరించాలన్నారు. రోడ్లపై చెత్త వేసే వారికి జరిమానా విధిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



అంగన్‌వాడీ కేంద్రంలో మాట్లాడుతున్న శాంతిశ్రీ

కందుకూరు, జూన్18(ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో మురుగు నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకుంటూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మహేశ్వరం సీడీపీవో శాంతిశ్రీ అన్నారు. బుధవారం మీర్కాన్‌పేట అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన బడిబాటలో భాగంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. మూడు సంవత్సరాలు నిండిన బాల బాలికలను అంగన్‌వాడీ కేంద్రానికి పంపాలని తల్లును కోరారు. అక్కడ విద్యా బుద్ధులతో పాటు పౌష్టికాహారం అందిస్తారని తెలిపారు. అనంతరం చిన్నారులతో అక్షరాభ్యాసం చేయించారు. అంగన్‌వాడీ సూపర్వైజర్ సబిత పాల్గొన్నారు.

మా భూములను నిషేధిత జాబితా నుంచి తీసేయండి



తహసీల్దార్ అయ్యప్పకు వినతి పత్రమందిస్తున్న రైతులు

యాచారం, జూన్ 18(ఆంధ్రజ్యోతి): నిషేధిత జాబితాలో ఉన్న పట్టాభూములకు విముక్తి కల్పించి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల పథకాలు వర్తింపజేసి ఆదుకోవాలని యాచారం మండలంలోని కుర్మిద్ద గ్రామ రైతులు రెవెన్యూ సదస్సులో రైతులు డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని కుర్మిద్దలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు తహసీల్దార్ అయ్యప్ప హాజరయ్యారు. కొందరు రైతులు వచ్చి నిషేధిత జాబితాలోని 2500 ఎకరాల పట్టా భూములను రైతుల పేరిట ఆన్‌లైన్‌లో నమోదు చేసి ప్రభుత్వాలిచ్చే పథకాలు వర్తింపచేయాలని రైతులు డిమాండ్ చేశారు. ఈ సమస్యపై కలెక్టర్‌కు వివరిస్తానని తహసీల్దార్ వారికి సర్ది చెప్పడంతో రైతులు శాంతించారు.

పుస్తకాలు విక్రయిస్తున్న స్కూల్ రూమ్ సీజ్



కేటీఎస్‌లో విక్రయిస్తున్న పుస్తకాలను పట్టుకున్న ఎంఈవో గోపాల్

పరిగి,జూన్ 18(ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా పరిగిలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో విక్రయిస్తున్న పాఠ్యపుస్తకాలు, నోటుపుస్తకాలు ఎంఈవో గోపాల్ బుధవారం సీజ్ చేశారు. కేటీఎస్ స్కూల్ యజమాన్యమే పుస్తకాలు విక్రయిస్తున్నట్టు గుర్తించి పుస్తకాలను, విక్రయిస్తున్న గదిని సీజ్‌చేశారు. విషయాన్ని డీఈవోకు తెలియజేసినట్లు ఎంఈవో చెప్పారు. ఏ ప్రైవేట్ పాఠశాలలోనూ పాఠ్య, నోటు పుస్తకాల విక్రయించకూడదని ఆయన సూచించాచారు. ఎవరైనా విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

తాగునీటి సమస్య తీర్చిన గ్రామస్తుడు

పూడూరు, జూన్ 18, (ఆంధ్రజ్యోతి): రేగడిమామిడిపల్లిలో తాగునీటి సమస్యను పరిష్కరించారు. గత కొన్ని నెలలుగా తాగునీటి సమస్య ఉందని అధికారులకు విన్నవించినా ఎవరూ పట్టించుకోలేదు. బుధవారం గ్రామానికి చెందిన భూపతిరెడ్డి రూ.35వేలతో కొత్త మోటారును వేయించారు. దీంతో గ్రామంలో నీటి సమస్య తీరింది.

కేశంపేట మండల ప్రత్యేకాధికారిగా గోపీకృష్ణ



గోపీకృష్ణను సన్మానిస్తున్న ఇన్‌చార్జి ఎంపీడీవో

కేశంపేట, జూన్ 18(ఆంధ్రజ్యోతి): జిల్లా పౌర సరఫరాల శాఖ మేనేజర్ గోపీకృష్ణ కేశంపేట మండల ప్రత్యేకాధికారిగా బుధవారం బాధ్యతలు తీసుకున్నారు. ఇప్పటి వరకు పనిచేసిన ఏడీఏ రాజారత్నం ప్రమోషన్‌పై నారాయణపేట జిల్లా వెళ్లారు. దీంతో జిల్లా కలెక్టర్ గోపీకృష్ణను నియమించారు. చార్జి తీసుకున్న గోపీకృష్ణను ఇన్‌చార్జి ఎంపీడీవో కిష్టయ్య, ఎన్ఆర్‌జీఎస్ టీఏ అజీజ్ సత్కరించారు. అనంతరం పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఇందిరమ్మ ఇళ్లు, తాగునీటి సమస్య రాకుండా చూసుకోవాలని, పారిశుధ్య పనుల్లో జాప్యం చేయొద్దని, మొక్కలు నాటేందుకు సిద్ధం చేసుకోవాలని సూచించారు.

సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న కళాశాల చైర్మన్ కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి

ఘట్‌కేసర్ రూరల్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని కేపీఆర్ఐటీ కళాశాల చైర్మన్ కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అన్నారు. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ, ఘనాపూర్‌లోని కేపీఆర్ఐటీ కళాశాలలో బుధవారం కెరియర్ డెవలప్‌మెంట్ సెంటర్(సీడీసీ)ను ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. విద్యార్థులు కెరియర్‌పై దృష్టిసారించాలని సూచించారు. వృత్తి, సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించుకోవాలన్నారు. అన్ని రంగాల్లో రాణిస్తేనే విజయం సాధిస్తారన్నారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్ ప్రశాంత్‌రెడ్డి, స్ట్రాటజిక్ డైరెక్టర్ కొమ్మూరి దివ్యారెడ్డి, ప్రిన్సిపల్ శ్రీనివాస్‌రెడ్డి, వైస్‌ప్రిన్సిపల్ శ్రీనాథ్‌కశ్యప్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అట్రాసిటీ కేసుపై విచారణ

తాండూరు రూరల్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): పొలం పనులకు వెళ్లి వస్తున్న తమను కొందరు కులం పేరుతో దూషించారని, వారిపై ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేయాలని వచ్చిన ఫిర్యాదుపై తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి బుధవారం గ్రామంలో విచారణ జరిపారు. కరన్‌కోట్ ఎస్ఐ విఠల్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు... ఈ నెల 15న చెనిగేష్‌పూర్‌నకు చెందిన బస్వరాజ్, లక్ష్మి పొలం పనులకు వెళ్లి వస్తుండగా, గ్రామానికి చెందిన రమేష్‌గౌడ్, నరేందర్‌గౌడ్, నానిగౌడ్, నరేష్‌గౌడ్, పవన్‌గౌడ్‌లు కలిసి ఎరుకలి కులం పేరుతో తమను దూషించారని, అలాగే దాడి చేసి తీవ్రంగా కొట్టారని ఫిర్యాదు చేశారన్నారు. బాధితుల ఫిర్యాదుతో అట్రాసిటీ కేసు నమోదు చేసినట్టుచెప్పారు. డీఎస్పీ గ్రామానికి చేరుకొని జరిగిన సంఘటనపై గ్రామస్తులతో మాట్లాడారు. కులం పేరుతో ఎందుకు దూషించారు? ఏం జరిగిందనే దానిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో శాంతి భద్రతలకు ఎవరైనా భంగం కలిగించేలా ప్రవర్తిస్తే చర్యలు తప్పవని ఈ సందర్భంగా డీఎస్పీ హెచ్చరించారు. ఆయన వెంట ఎస్ఐ, సిబ్బంది ఉన్నారు.



చెనిగేష్‌పూర్‌లో విచారణ జరుపుతున్న డీఎస్పీ బాలకృష్ణారెడ్డి

డాక్టర్ కారులో 65 గ్రాముల గంజాయి

» వాహన తనిఖీల్లో దొరికిన వైనం.. వికారాబాద్‌లో ఘటన

వికారాబాద్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): పోలీసులు చేపట్టిన వాహన తనిఖీల్లో భాగంగా ఓ వైద్యుడి కారులో గంజాయి దొరకడం వికారాబాద్‌లో తీవ్ర కలకలం రేపింది. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. వికారాబాద్ సీఐ భీమ్‌కుమార్ ఆలంపల్లి రోడ్డులో మంగళవారం రాత్రి వాహన తనిఖీలు చేస్తూ ఓ ఫార్చ్యూనర్ కారును ఆపారు. వికారాబాద్‌కు చెందిన ఓ వైద్యుడు ఆ కారులో ఉన్నారు. ఆ కారులో తనిఖీ చేయగా 65 గ్రాముల గంజాయి లభించడంతో పోలీసులు ఆ వైద్యుడిని అదుపులోకి తీసుకున్నారు. సదరు వైద్యుడిపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నామని సీఐ తెలిపారు. కాగా, 'వికారాబాద్ డాక్టర్ వద్ద గంజాయి కలకలం' అనే వార్త సోషల్ మీడియాలో వైరల్ కాగా ఇద్దరు వైద్యుల మధ్య ఉన్న పాత గొడవలే ఈ గంజాయి కేసుకు కారణమనే చర్చ జరుగుతోంది. కావాలనే సదరు వైద్యుడిని గంజాయి కేసులో ఇరికించారనే ప్రచారం ఉంది. కాగా, వికారాబాద్ మెడికల్ అసోసియేషన్ వైద్యులు సదరు డాక్టర్‌తో మాట్లాడి కేసు గురించి ఆరా తీశారు. తాను గంజాయి వినియోగించనని, కావాలనే తనని ఈ కేసులో ఇరికించారని ఆయన చెప్పడంతో తోటి డాక్టర్లు స్థానిక ఎక్సైజ్ కార్యాలయానికి వెళ్లి అధికారులను కలిశారు. ఈ కేసులో తామేమీ చేయలేమని, తనిఖీల్లో పట్టుబడిన దానిపై కేసు చేసే అధికారం తమకు ఉంటుందని వారు తేల్చిచెప్పినట్టు సమాచారం. దీంతో డాక్టర్లు ఎస్పీ కార్యాలయానికి వెళ్లి సదరు డాక్టర్‌పై కేసు నమోదు విషయంలో కుట్ర జరిగిందనే అనుమానాలున్నాయని, దీనిపై పూర్తిస్థాయిలో విచారణ చేసి చర్యలు తీసుకోవాలని కోరారు.

సమస్యల పరిష్కారానికే సదస్సులు

మోమిన్‌పేట్/మర్పల్లి, జూన్ 18(ఆంధ్రజ్యోతి): భూ సమస్యల శాశ్వత పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, ఆర్డీవో వాసుచంద్ర అన్నారు. బుధవారం మోమిన్‌పేట్‌లో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. దరఖాస్తులను పరిశీలించి అధికారులు భూసమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటారని తెలిపారు. 23 గ్రామాల్లో వెయ్యి దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ రవీందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్‌రెడ్డి, డీటీ సురేశ్‌కుమార్, ఆర్ఐలు గోవర్ధన్, సరిత, జూనియర్ అసిస్టెంట్లు మహేశ్‌గౌడ్, అలివేలు, సునీత, మౌనిక, సిబ్బంది రాఘవేందర్, రాజు, నర్సిములు, కార్యదర్శులు స్వప్న, నాయకులు సుభాష్‌గౌడ్, ఎజాజ్‌పాషా, పటేల్, రవి తదితరులు పాల్గొన్నారు. మర్పల్లి మండలం నర్సాపూర్‌లో రెవెన్యూ సదస్సుకు అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ హాజరయ్యారు. రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అందజేసిన దరఖాస్తులను అధికారులు పరిశీలించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటారన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో, డీటీ పరశురాం పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

గంజాయి విక్రయిస్తున్న బాలుడి అరెస్టు

» 3.13కిలోల గంజాయి స్వాధీనం

ఘట్‌కేసర్ రూరల్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): గంజాయి విక్రయిస్తున్న ఓ మైనర్ బాలుడిని పోలీసులు అరెస్టు చేసి జువైనల్ హోంకు తరలించారు. సీఐ పరశురాం తెలిపిన వివరాల ప్రకారం.. ఎదులాబాద్‌కు చెందిన ఓ బాలుడు(17), అతడి స్నేహితుడు రవితో ఒడిశా రాష్ట్రం, మల్కన్‌గిరికి వెళ్లి 3.13కిలోల గంజాయి కొని తెచ్చారు. చందుపట్లగూడ సమీపం లింగారెడ్డి వెంచర్‌లో బుధవారం గంజాయి విక్రయిస్తుండగా పోలీసులు 3.13కిలోల గంజాయిని స్వాధీనం చేసుకొని బాలుడిని నగరంలోని జువైనల్ హోంకు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.



ఎంఈవోకు వినతిపత్రం అందజేస్తున్న టీఎస్ఎస్‌వో నాయకులు

నిబంధనలు పాటించని స్కూళ్లపై చర్యలు తీసుకోవాలి

ఆమనగల్లు, జూన్ 18(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిబంధనలను పాటించని ప్రైవేట్ స్కూళ్ల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ సామాజిక స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ ఆమనగల్లు ఇన్‌చార్జి బాలవర్షిత్‌కుమార్ ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం ఎంఈవో పాండుకు వినతిపత్రం అందజేశారు. ప్రైవేట్ స్కూళ్ల నిర్వాహకులు ఇష్టారాజ్యంగా డబ్బు గుంజుతున్నారని తెలిపారు. అడ్మిషన్లు, ఫీజుల పేరుతో భారీగా దండుకుంటున్నారన్నారు. పాఠశాలల్లో పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్‌లు, యూనిఫామ్స్, స్టేషనరీ వస్తువులు అధిక ధరకు విక్రయిస్తున్నారని, ఈ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో బద్ధి రాజు, సాయి, ధనుశ్, శివరాజ్, నందు, శివకుమార్ ఉన్నారు.



కొందుర్గు-టేకులపల్లి బ్రిడ్జి పనుల వద్ద గ్రామస్తులు

టేకులపల్లి బ్రిడ్జికి మరమ్మతులు

చౌదరిగూడ,జూన్ 18(ఆంధ్రజ్యోతి): కొందుర్గు మండలం టేకులపల్లి శివారులోని వాగుబ్రిడ్జి వర్షానికి కొట్టుకుపోయింది. గుంతలమయంగా మారి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. తమ సమస్యలు గ్రామస్తులు ఎమ్మెల్యే వీర్లపల్లి దృష్టికి తీసుకుపోయారు. ఆయన స్పందించి బ్రిడ్జి మరమ్మతులకు నిధులు మంజూరు చేయించారు. దీంతో బుధవారం పనులు చేశారు. బ్రిడ్జి పనులతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.



బదిలీ అయిన బాల్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్‌లను సన్మానిస్తున్న ఎస్సై వెంకటేశ్, నాయకులు

పనితీరుతోనే ప్రజల్లో కీర్తి

ఆమనగల్లు, జూన్ 18(ఆంధ్రజ్యోతి): అంకిత భావం, చిత్తశుద్ధి, నిస్వార్థ సేవలందించే ప్రభుత్వ ఉద్యోగులు ప్రజల అభిమానాన్ని పొందుతారని ఆమనగల్లు ఎస్సై బి.వెంకటేశ్ అన్నారు. ఉద్యోగులకు బదిలీలు సహజమని, పనిచేసిన చోట అందించిన సేవలు మాత్రం చిరస్థాయిగా నిలుస్తాయన్నారు. ఏఎస్సై బాల్‌రెడ్డి కడ్తాల్ పోలీస్‌స్టేషన్‌కు, హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాస్‌గౌడ్ నార్సింగ్‌కు బదిలీ అయ్యారు. సుదీర్ఘకాలం సేవలందించి బదిలీ అయిన ఈ ఇద్దరు ఉద్యోగులకు బుధవారం పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఎస్సై ఆధ్వర్యంలో వీడ్కోలు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. వారి సేవలను కొనియాడారు. శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసులకు ప్రజల సహకారం అవసరం ఉంటుందన్నారు. బదిలీ అయిన బాల్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్‌లను బీఆర్ఎస్ మునిసిపల్ అధ్యక్షుడు పత్యానాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్ నిరంజన్‌గౌడ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు సైదులుగౌడ్, పసుపుల సాయిలు పూల మాలలు, శాలువాలు వేసి సన్మానించారు. కార్యక్రమంలో ఎస్సై సీతారాంరెడ్డి, ఏఎస్సై రామ్‌రెడ్డి, నాయకులు వెంకటేశ్, సత్యం, దశరథం, రాములు, సురేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమ నర్సరీలు

కూరగాయ పంటల నారు విక్రయాలు ● నకిలీతో నష్టపోతున్న రైతులు



చౌదర్‌పల్లిలో అక్రమంగా వెలసిన కూరగాయల నర్సరీ

యాచారం, జూన్ 18(ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లాలో కూరగాయల పంటల నారును విక్రయించే నర్సరీలు పలుచోట్ల అక్రమంగా వెలిశాయి. నల్గొండ జిల్లాకు చెందిన కొందరు రహదారుల పక్కన, గ్రామాల్లో కూరగాయల నారు నర్సరీలను ఏర్పాటు చేశారు. వాటిల్లో టమాట, వంకాయ, బెండ, మిర్చి తదితర పంటల నారును విక్రయిస్తున్నారు. నల్గొండజిల్లాకు చెందిన కొందరు రంగారెడ్డి జిల్లాలో నారు నర్సరీలను ఏర్పాటు చేసి లాభాలు గడిస్తున్నారు. అయితే ఇలాంటి నర్సరీల్లో అమ్మే నకిలీ నారు కొని నాటుకున్న కొందరు రైతులు నష్టపోతున్నారు. అయితే ఇలాంటి నర్సరీలు ఏర్పాటు చేసుకోవాలంటే ఉద్యానవన శాఖ వద్ద నమోదు చేసుకోవాలి. ఈ నర్సరీల్లో విక్రయించే నారు నాణ్యమైనదేనా? ఎలాంటి విత్తనాలు వాడుతున్నారు? వంటి అంశాలపై అధికారులు తనిఖీలు చేస్తుంటారు. ఇటీవల మాల్‌లో ఓ నర్సరీలో కొన్న నారు నాటగా పూతకాత రాలేదు. దీంతో రైతు పోలీసులకు పిర్యాదు చేయగా బాధిత రైతుకు నర్సరీ వారు కొంత డబ్బు చెల్లించి చేతులు దులుపుకున్నారు. కాగా జిల్లాలో 400 వరకు అక్రమ నర్సరీలు ఉన్నాయి. యాచారం, మాల్, గున్‌గల్, మాల్‌లలో కూరగాయ నర్సరీలను నిర్వహిస్తున్నారు. ఒక్క టమాట మొలక(నారు)ను 50పైసల నుంచి రూపాయికి విక్రయిస్తున్నారు. ఒక్కో మొలక లెక్కించి కట్టలు కట్టి అమ్ముతున్నారు. చౌదర్‌పల్లిలో ఓ నర్సరీ నిర్వాహకుడిని అనుమతి తీసుకున్నారా? అని ప్రశ్నించగా.. 'తొందరేముంది. జిల్లా అధికారులకు దరఖాస్తు చేశా.' అని నింపాదిగా చెప్పాడు. నారు నర్సరీలపై జిల్లా ఉద్యాన శాఖ అధికారి సురేష్‌ను స్పందన కోరగా.. ఇబ్రహీంపట్నం, మంచాల, యాచారం, కందుకూరు, మహేశ్వరం ప్రాంతాల నుంచి నర్సరీల ఏర్పాటుకు దరఖాస్తులేమీ రాలేదని తెలిపారు.

అనుమతితోనే నర్సరీలు నిర్వహించాలి



కూరగాయల నారు విక్రయించే నర్సరీల ఏర్పాటుకు ఉద్యాన శాఖలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. జిల్లాలో ఇప్పటి వరకు మాకు రెండుమూడు దరఖాస్తులే అందాయి. ఇప్పుడున్నవన్నీ అక్రమంగా నిర్వహిస్తున్నవే. ఇబ్రహీంపట్నం డివిజన్ నుంచి ఒక్క దరఖాస్తూ రాలేదు. రైతులు అక్రమ నర్సరీల్లో ఏ నారునూ కొనొద్దు. ఒక వేళ నకిలీ విత్తనాలతో నారు పెంచితే పంట మొత్తం నష్టపోతారు. ఇలాంటి నర్సరీలపై మాకు సమాచారమిస్తే చర్యలు తీసుకుంటాం.

- సురేశ్, జిల్లా ఉద్యానవన అధికారి

లైసెన్స్‌డ్ సర్వేయర్లు అవగాహన పెంచుకోవాలి

» అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి



సర్వేయర్ల శిక్షణలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి

శామీర్‌పేట, జూన్ 18(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం చేపట్టిన భూ భారతి చట్టాలపై అవగాహన పెంచుకొని రైతులకు సేవలందించాలని లైసెన్స్‌డ్ సర్వేయర్లకు జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి సూచించారు. శామీర్‌పేట మండల పరిషత్‌లో ఈ నెల 2 నుంచి జిల్లాలోని లైసెన్స్‌డ్ సర్వేయర్లకు అధికారులు భూ భారతి చట్టంపై శిక్షణ ఇస్తున్నారు. బుధవారం కలెక్టర్ విజయేందర్‌రెడ్డి సందర్శించి సర్వేయర్ల శిక్షణ పనితీరును పరిశీలించారు. రెవెన్యూ చట్టంలో సర్వేయర్ల పాత్ర కీలకం అన్నారు. శిక్షణలో శ్రద్ధగా విని, శిక్షణ అనంతరం భూముల సర్వే బాధ్యతగా చేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ యాదగిరిరెడ్డి, డీఐవో బలరాం, సిబ్బంది పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న బీజేపీ రాష్ట్ర నాయకులు ప్రహ్లాద్‌రావు

కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

కులకచర్ల, జూన్ 18(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ రాష్ట్ర నాయకులు కరణం ప్రహ్లాద్‌రావు అన్నారు. బీజేపీ ప్రభుత్వం వచ్చి 11సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా బుధవారం కులకచర్లలో పార్టీ మండల అధ్యక్షుడు వెంకటేశ్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. పేదలకు ఇస్తున్న మూడునెలల ఉచిత బియ్యంలో కేంద్ర ప్రభుత్వ వాటా ఉందన్నారు. ఇందిరమ్మ ఇళ్లకూ కేంద్రం డబ్బులు ఇస్తోందన్నారు. ఆపరేషన్ సిందూర్‌తో పాకిస్థాన్‌కు తమ సత్తా చూపామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు అంజయ్య, మహిళా మోర్చా జిల్లా ఉపాధ్యక్షురాలు, మాజీ సర్పంచ్ సౌమ్యావెంకట్‌రామ్‌రెడ్డి, చౌడాపూర్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు బాలకిష్టారెడ్డి, మోనాచారి, కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు భీమయ్య, సందని బిచ్చయ్య, రవీందర్‌రెడ్డి, పోమాల నరేశ్, కొండ అంజి, వెన్నచెడ్ రాజు, సుంకు మల్లేశం, రాంచంద్రయ్య, రాజశేఖర్, మాసన్న తదితరులు పాల్గొన్నారు.

శంకర్‌పల్లి అభివృద్ధికి చేయూతనివ్వాలి



విద్యార్థినికి ప్రశంసాపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే యాదయ్య

శంకర్‌పల్లి, జూన్ 18(ఆంధ్రజ్యోతి): శంకర్‌పల్లి పట్టణం అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములయి చేయూతనివ్వాలని చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య అన్నారు. మున్సిపాలిటీలో 100 రోజుల ప్రణాళికలో భాగంగా ఆదర్శ పాఠశాల విద్యార్థులకు తడి పొడి చెత్త వేరు చేయడం, హోం కంపోస్టింగ్‌పై చిత్రలేఖనం, రంగోలి, వ్యాస రచన పోటీలు నిర్వహించారు. 15మంది విద్యార్థులకు బుధవారం ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పరిసరాలు శుభ్రంగా ఉంటేనే ఆరోగ్యం బాగుంటుందని చెప్పారు. విద్యార్థులు నేర్చుకున్న అంశాలను తల్లిదండ్రులు, ఇరుగుపొరుగు వారికి వివరించి పరిసరాల పరిశుభ్రతకు పాటుపడాలన్నారు. బాగా చదువుకుని వృద్ధిలోకి రావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కమిషనర్ యోగేశ్, సీఐ శ్రీనివాస్‌గౌడ్, పాఠశాల ప్రిన్సిపాల్ శోభారాణి, మేనేజర్ అంజన్‌కుమార్, ఎన్విరాన్మెంటల్ ఇంజినీర్ ఆనంద్, నాయకులు గోపాల్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్, చంద్రమౌళి, మధు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీవో వెంకయ్యగౌడ్

వన మహోత్సవాన్ని విజయవంతం చేయాలి

శంకర్‌పల్లి, జూన్ 18(ఆంధ్రజ్యోతి): వన మహోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని శంకర్‌పల్లి ఎంపీడీవో వెంకయ్యగౌడ్ కోరారు. శంకర్‌పల్లి మండల పరిషత్‌లో బుధవారం పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్‌అసిస్టెంట్లు, ఉపాధి హామీ మేట్లకు శిక్షణ నిర్వహించారు. ఉపాధి కింద గ్రామాల్లో భారీ సంఖ్యలో మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంచాలని కోరారు. పండ్ల తోటలు పెంచుకునే విధంగా రైతులను ప్రోత్సహించాలని తెలిపారు. మండలంలో వన మహోత్సవం విజయవంతం అయ్యేలా సహకరించాలని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీవో గిరిరాజ్, ఏపీవో నాగభూషణం పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

స్వచ్ఛ మున్సిపాలిటీగా తీర్చిదిద్దాలి

కీసర రూరల్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛతలో మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దాలని దమ్మాయిగూడ మున్సిపల్ కమిషనర్ నాగమణి అన్నారు. బుధవారం 100 రోజుల ప్రణాళికలో భాగంగా మున్సిపల్ పరిధి కీసరలోని మల్లికార్జుననగర్, శివాజీనగర్ కాలనీల్లో మున్సిపల్ సిబ్బందితో కలిసి పర్యటించారు. తడి, పొడి చెత్త నిర్వహణపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ ప్రభు, పంచాయతీ కార్యదర్శి గంగన్న, వార్డు ఆఫీసర్ సాయిలు, దుర్గ, బిల్ కలెక్టర్లు మహేందర్, రాము, సిబ్బంది పాల్గొన్నారు.

స్వచ్ఛతపై విద్యార్థినులకు పోటీలు

మేడ్చల్ టౌన్: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 100 రోజుల ప్రణాళికలో భాగంగా బుధవారం మేడ్చల్ బాలికల గురుకుల పాఠశాలలో స్వచ్ఛతపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనపరిచిన విద్యార్థినులకు బహుమతులు అందజేశారు.

నేరాల కట్టడికి సీసీ కెమెరాలు దోహదం

చౌడాపూర్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ప్రజలు, దుకాణా సముదాయల యజమానులు నేరాల కట్టడికి సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని ఎస్సై రమేశ్ సూచించారు. బుధవారం చౌడాపూర్ తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో సీసీ కెమెరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానం అన్నారు. వాటి ఏర్పాటుతో చోరీలు, ఇతర సంఘ వ్యతిరేక కార్యకలాపాలను అదుపుచేయొచ్చని అన్నారు. ప్రజలు సీసీ కెమెరాల ఏర్పాటుకు ముందుకు రావాలన్నారు.



డాక్టర్ వెంకటరమణను సన్మానిస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

సేవలతోనే సామాజిక గుర్తింపు

షాద్‌నగర్ అర్బన్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): ఉత్తమ సేవలతోనే సామాజిక గుర్తింపు వస్తుందని మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీ నాగరకుంట నవీన్‌కుమార్‌రెడ్డి అన్నారు. షాద్‌నగర్‌కు చెందిన డాక్టర్ మిర్యాల వెంకటరమణ ఓ యూ ట్యూబ్ చానల్ నుంచి ఉత్తమ అవార్డును అందుకున్నారు. బుధవారం ఆయనను ఎమ్మెల్సీ నవీన్ కుమార్‌రెడ్డి సన్మానించారు. మనిషికి దేవుడు పోసిన ప్రాణాన్ని నిలబెట్టే శక్తి వైద్యులకే ఉంటుందని, అలాంటి వృత్తిలో ఉంటూ సేవలందిస్తున్న డాక్టర్ వెంకటరమణ ఆదర్శనీయుడని అన్నారు. అలాగే ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మలిపెద్ది శ్రీనివాస్‌గుప్తా ఆధ్వర్యంలో వెంకటరమణ-తులసి దంపతులను సన్మానించారు. అంతకు టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు బక్కని నర్సింహులు, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ బాబర్‌ఖాన్, ప్రముఖులు నాగిళ్ల గోపాల్‌గుప్తా, గజవాడ నర్సింహులు, సురేష్, సంగమేశ్వర్, ఆర్.కృష్ణయ్య, బాల్‌రాజ్‌గుప్తా, శివకుమార్, శ్రీనివాస్, పెద్ది రామ్మోహన్, పెంటయ్య, నారాయణ తదితరులు సన్మానించారు.

పాఠశాలకు గ్యాస్ సిలిండర్ అందజేత

పెద్దేముల్, జూన్18(ఆంధ్రజ్యోతి): తాను విధులు నిర్వహించే పాఠశాలకు ఉపాధ్యాయుడు గ్యాస్ సిలిండర్, స్టౌవ్ అందజేశాడు. పెద్దేముల్ మండలం ఖానాపూర్ గ్రామంలోని పాఠశాలలో పట్లోళ్ల అనిల్ ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. విద్యార్థులకు సమయానికి నాణ్యమైన, రుచికరమైన భోజనం అందించాలనే ఉద్దేశంతో సొంత డబ్బుతో గ్యాస్ అందజేసినట్లు తెలిపారు.

ట్రాక్టర్ల నిర్వహణ భారం మోయలేం



కొడంగల్ రూరల్: ఎంపీడీవో ఉషశ్రీకి తాళాలను అందజేస్తున్న పంచాయతీ కార్యదర్శులు

ఎంపీడీవోలకు తాళాలు అందజేస్తున్న పంచాయతీ కార్యదర్శులు

దోమ, జూన్ 18(ఆంధ్రజ్యోతి): ఆర్థిక పరమైన భారాన్ని తాము భరించలేమని దోమ మండల పంచాయతీ కార్యదర్శులు అన్నారు. బుధవారం వారు ఎంపీడీవో గమ్యానాయక్‌కు పంచాయతీ ట్రాక్టర్ల తాళాలు అందజేశారు. కార్యదర్శుల సంఘం మండలాధ్యక్షుడు మొగులయ్య మాట్లాడుతూ.. ప్రభుత్వం ఫిబ్రవరి 2024 నుంచి నిధులు విడుదల చేయడం లేదన్నారు. ట్రాక్టర్ల నిర్వహణ భారం, బోరు మోటార్ల మరమ్మతులు, పారిశుధ్యం పనులతో ఆర్థిక భారాన్ని మోయలేకపోతున్నామని వాపోయారు. అప్పు చేసి ఇన్ని రోజులు గ్రామాల్లో పనులు చేయించాం అన్నారు. 36 పంచాయతీల కార్యదర్శులు ట్రాక్టర్ల తాళాలు, వినతిపత్రాలు అందజేశారు. కొడంగల్ మండలంలోని 25 పంచాయతీల కార్యదర్శులు ట్రాక్టర్ల తాళాలను ఎంపీడీవో ఉషశ్రీకి, ఎంపీఈవో జైపాల్‌రెడ్డికి అందజేశారు. సర్పంచ్‌ల పదవీ కాలం ముగిసి 16 నెలల గడిచినా ప్రభుత్వం పంచాయతీల నిర్వహణకు నిధులు విడుదల చేయడం లేదన్నారు. తాము అప్పులు చేసి పనులు చేయించడం తలకు మించిన భారంగా మారిందన్నారు. ట్రాక్టర్‌కు డీజిల్‌తో పాటు ఇతర ఖర్చులకు డబ్బుల్లేక ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు కొండన్న, క్రిష్ణ, డేవిడ్, క్రిష్ణవేణి, లావణ్య, బుగ్గప్ప పాల్గొన్నారు.



దోమ: ఎంపీడీవో గమ్యానాయక్‌కు ట్రాక్టర్ తాళాలు అప్పగిస్తున్న పంచాయతీ కార్యదర్శులు

ఎమ్మార్పీఎస్‌ను బలోపేతం చేయాలి

శామీర్‌పేట, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఎమ్మార్పీఎస్ ఉద్యమ పార్టీని ఇతర పార్టీలకు దీటుగా బలోపేతం చేయాలని ఎమ్మార్పీఎస్ జాతీయ కళామండలి అధ్యక్షుడు ఎన్వై అశోక్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి తిప్పారపు లక్ష్మణ్‌మాదిగ ఆధ్వర్యంలో శామీర్‌పేట మండలం బాబాగూడలో నిర్వహించిన సమావేశానికి హాజరై మాట్లాడుతూ జూలై 7న ఎమ్మార్పీఎస్ వ్యవస్థపక దినోత్సవ వేడుకలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జి నల్ల కృష్ణమాదిగ, నాయకులు చిన్న స్వామి మాదిగ, పెద్ద స్వామిమాదిగ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పరిగి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సరఫరాలో గురువారం అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏఈ హరికృష్ణ తెలిపారు. గురువారం ఉదయం పది గంటల నుంచి సాయంత్రం మూడు గంటల వరకు సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. పరిగి పట్టణంతోపాటు, శ్రీనివాస స్టీల్ కంపెనీ, రంగంపల్లి ఫీడర్‌లో సరఫరా ఉండదని తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

లక్ష్యానికి చేరువలో ధాన్యం కొనుగోళ్లు

(ఐదో పేజీ తరువాయి)

అధికారులు భావిస్తున్నారు. వికారాబాద్ జిల్లాలో వరి సాగు, కోతలు బాగా ఆలస్యంగా ప్రారంభం కావడం వల్ల ధాన్యం సేకరణ జూన్ మూడో వారం ముగిసే వరకు కొనసాగనుంది. వరి బాగా సాగయ్యే జిల్లాల్లో ధాన్యం కోతలు ముగిసే సమయానికి వికారాబాద్ జిల్లాలో ప్రారంభమైన విషయం తెలిసిందే.

బకాయిలకు ఎదురుచూపులు

జిల్లాలో కొనుగోలు కేంద్రాల్లో ఇప్పటి వరకు 16,253 మంది రైతులు 92,600 మెట్రిక్ టన్నులు ధాన్యం విక్రయించారు. కొనుగోలు కేంద్రాల్లో విక్రయించిన ధాన్యానికి సంబంధించి రైతులకు రూ.213.89 కోట్లు చెల్లించాల్సి ఉండగా, ఇప్పటి వరకు 15,500 మంది రైతుల ఖాతాల్లో రూ.184 కోట్లు జమ చేశారు. ఇంకా 753 మంది రైతులకు రూ.29.89 కోట్లు చెల్లించాల్సి ఉంది. ధాన్యం విక్రయించిన 24 గంటల్లోనే సంబంధిత రైతుల బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని అధికారులు చెబుతున్నా.. బకాయిల కోసం రైతులు ఎదురు చూడాల్సి వస్తోంది.

మిల్లర్ల ఉదాసీన వైఖరి వల్లే..

ధాన్యం విక్రయించిన రైతులకు డబ్బుల చెల్లింపుల్లో జాప్యం జరుగుతోంది. ధాన్యం సేకరించిన 48 గంటల్లోగా రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేయాలన్న ప్రభుత్వ ఆదేశాలు మిల్లర్ల ఉదాసీన వైఖరి కారణంగా ప్రభుత్వ లక్ష్యం అమలుకు నోచుకోవడం లేదు. కొనుగోలు కేంద్రాల నుంచి రైతులు, ధాన్యం వివరాలు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసినా మిల్లుల వరకు వచ్చే సరిగా తీవ్ర జాప్యం జరుగుతోంది. మిల్లుల వద్ద అన్ లోడింగ్ ఆలస్యం కావడం, మిల్లులకు వచ్చే ధాన్యానికి సంబంధించిన వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయడంలో రైస్ మిలర్లు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఫలితంగా రైతుల ఖాతాల్లో సకాలంలో ధాన్యం డబ్బులు జమ కావడం లేదు. రైతుల వివరాలు ట్యాబ్‌లో నమోదు చేయడం, ట్రక్ షీట్ వివరాల నమోదు మిల్లుల వద్ద పెండింగ్‌లో ఉండడం వంటి కారణాలతో చెల్లింపులు ఆలస్యమవుతున్నట్లు తెలుస్తోంది. సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి మిల్లుల వద్ద పెండింగ్ లేకుండా చెల్లింపులు త్వరితగతిన జరిగేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

మేడ్చల్‌లో ముగిసిన సేకరణ

మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లాలో ధాన్యం సేకరణ ముగిసింది. యాసంగి సీజన్‌లో 28 వేల మెట్రిక్ టన్నుల వరి ధాన్యాన్ని పూర్తి స్థాయిలో కొనుగోలు చేయాలని పౌరసరఫరాల శాఖ లక్ష్యంగా పెట్టుకుంది. కాగా, 3,467 మంది రైతుల నుంచి 16,697 మెట్రిక్ టన్నుల ధాన్యంను రైతుల నుండి సేకరించారు. రూ. 34.84 కోట్ల విలువైన ధాన్యాన్ని సేకరించారు. ఇందులో ఇప్పటి వరకు 2,632 మంది రైతులకు రూ.30.87 కోట్లను చెల్లించారు. దొడ్డు రకం ధాన్యాన్ని 2,660 మంది రైతుల నుంచి 13,576 మెట్రిక్ టన్నులు, సన్న రకం ధాన్యంను 807 మంది రైతుల నుండి 3,120 మెట్రిక్ టన్నుల ధాన్యంను సేకరించారు. యాసంగిలో ధాన్యం సేకరణకు 13 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ప్రతాపసింగారం, ఎదులాబాద్, మాదారం, కేశవరం, లక్ష్మాపూర్, ఉద్దమర్రి, మేడ్చల్, డబిల్‌పూర్, పూడూరు, శామీర్‌పేట, అలియాబాద్, కీసరలో ఏర్పాటు చేశారు. జిల్లా పౌరసరఫరాల శాఖ మేనేజర్ సుగుణబాయి, అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డిలు నిత్యం కొనుగోలు కేంద్రాల వద్ద పరిస్థితిని పరిశీలించారు. దాదాపు 20 రోజులుగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా వసతులు కల్పించారు.


ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి(ఫైల్)

క్రైం కార్నర్

వివాహిత అదృశ్యం


నందిని(ఫైల్)

ఘట్‌కేసర్ రూరల్, జూన్18(ఆంధ్రజ్యోతి): వివాహిత అదృశ్యమైన ఘటన ఘట్‌కేసర్ పోలీసుస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ పరశురాం తెలిపిన వివరాల ప్రకారం.. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ కృష్ణమార్ట్ సమీపంలో ఉండే కంచుకం వెంకటేశ్ భార్య నందిని(24) ఈ నెల 15న ఇంట్లో ఎవరికీ చెప్పకుండా ముగ్గురి పిల్లలను వదిలి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. విషయం తెలుసుకున్న భర్త తెలిసిన వారిని, బంధువులను, మిత్రులను విచారించినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో ఘట్‌కేసర్ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

బొంరాస్‌పేట, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. బుధవారం తెల్లవారుజామున మండలంలోని బురాన్‌పూర్ శివారులో టీఎస్ 34 టీఏ 9009 నంబర్ గల బొలెరో వాహనంలో బియ్యాన్ని తరలిస్తుంగా పోలీసులు తనిఖీ చేశారు. 20 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని గుర్తించి నిందితుడు వడ్ల మోహన్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అబ్దుల్ రవూఫ్ తెలిపారు.

జీవాలు చోరీ.. నిందితుల అరెస్టు

పూడూరు, జూన్ 18(ఆంధ్రజ్యోతి): మేకలు, గొర్రెల చోరీకి పాల్పడుతున్న వారిని అరెస్టు చేసినట్లు చెన్‌గోముల్ ఎస్ఐ మధుసూదనరెడ్డి పేర్కొన్నారు. బుధవారం నిందితులను మీడియా ఎదుట ప్రవేశపెటి వివరాలు వెల్లడించారు. హైదరాబాద్‌కు చెందిన బిషూకర్మ ఏకేందర్ సింగ్, మహ్మద్ వాజిద్, షేక్ సోహెల్ ముగ్గురు కారు అద్దెకు తీసుకుని హైదరాబాద్ చుట్టుపక్కల ఉన్న సంగారెడ్డి, షాద్‌నగర్, ఆదిభట్ల, చెన్‌గోముల్ ప్రాంతాల్లో తిరుగుతున్నారు. ఆయా ప్రాంతాల్లో మేకలు, గొర్రెలు దొంగతనం చేసి అద్దెకారులో వేసుకుని హైదరాబాద్ జియాగూడ మార్కెట్‌లో విక్రయించి డబ్బులు సంపాదిస్తున్నారు. బుధవారం ఉదయం 5గంటల ప్రాంతంలో మన్నెగూడ చౌరస్తాలో హెడ్‌కానిస్టేబుల్ పెంటయ్య, సిబ్బందితో కలిసి వాహనాలు తనిఖీ చేస్తుండగా అనుమానం వారి వాహనాన్ని ఆపి విచారిస్తే చెన్‌గోముల్, సంగారెడ్డి, షాద్‌నగర్, ఆదిభట్ల ప్రాంతాల్లో చోరీకి పాల్పడినట్లు ఒప్పుకున్నారు. నిందితులను అదుపులోకి తీసుకుని రిమాండ్ తరలించారు. దొంగతనం చేసిన నాలుగు మేకలు, రూ.42 వేల నగదు, కారును స్వాధీనం చేసుకున్నారు.

ప్రతిభ చూపిన విద్యార్థులకు సన్మానం



ఘట్‌కేసర్ రూరల్, జూన్18(ఆంధ్రజ్యోతి): ఘట్‌కేసర్ మున్సిపాలిటీ పరిధిలోని ఎదులాబాద్ జిల్లా పరిషత్ పాఠశాలలో బుధవారం పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను సన్మానించారు. మండలంలో ఉత్తమ ర్యాంకులు సాధించిన ప్రవళిక, చందన, హర్షిత, లహరి, మానసతో పాటు పలువురు విద్యార్థులను శాలువాలతో సన్మించి అభినందించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం కృష్ణకుమారి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, నాయకులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో అర్చకుడి మృతి


శ్రీనివాసమూర్తి(ఫైల్)

కొడంగల్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): కొడంగల్ పట్టణంలోని శ్రీ చెన్నకేశవ స్వామి, శ్రీ రాఘవేంద్రస్వామి ఆలయాల అర్చకులు అక్కి శ్రీనివాస మూర్తి(64) బుధవారం మధ్యాహ్నం అనారోగ్యంతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అంత్యక్రియలు గురువారం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆయనకు ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు. ఎన్నో ఏళ్లగా అర్చకుడిగా సేవలు అందిస్తున్న ఆయన మృతి బాధాకరమని ధూప దీప నైవేద్య అర్చక సంఘం జిల్లా అధ్యక్షుడు లోకూర్తి జయతీర్థ చారి అన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి


సిబ్బందితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

యాలాల, జూన్ 18, (ఆంధ్రజ్యోతి): ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో ఎల్ఎన్ఆర్ సహకారంతో పేరి రాజేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శంకర కంటి ఆసుపత్రి, జిల్లా అంధత్వ నివారణ సంస్థ సంయుక్తంగా నిర్వహించిన ఈ శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సిరెడ్డి, యాలాల పీఏసీఎస్ చైర్మన్ సురేందర్‌రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు పేరి రాజేందర్‌రెడ్డి, డాక్టర్ సంపత్‌కుమార్, ఏఎంసీ చైర్మన్ బాల్‌రెడ్డి, కోఆప్షన్ల సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు అక్బర్ బాబా, కాంగ్రెస్ మండల మాజీ అధ్యక్షుడు భీమయ్య, ఏఎంసీ డైరెక్టర్ చిన్న, అశోక్‌నాయి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పేదల సొంతింటి కలను నిజం చేస్తున్నాం


మేడ్చల్ టౌన్: ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి ముగ్గుపోసిన నాయకులు

మేడ్చల్ టౌన్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): పేదల సొంతింటి కలను నిజం చేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని కాంగ్రెస్ మేడ్చల్ మండల అధ్యక్షుడు రమణారెడ్డి అన్నారు. బుధవారం ఎల్లపేట మున్సిపాలిటీ డబీల్ పూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మిణానికి భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు.

కొడంగల్ రూరల్: పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేమని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నందారం ప్రశాంత్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని టేకుల్‌కోడ్ గ్రామంలో మంజూరైన ఇందిరమ్మ ఇండ్ల ప్రొసీడింగ్ కాపీలను ఎంపీడీవో ఉషశ్రీ, నందారం ప్రశాంత్‌తో కలిసి లబ్ధిదారులకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రొసీడింగ్‌లు పొందిన వారు ఇండ్ల నిర్మాణ పనులను ప్రారంభించాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి చైతన్యకుమార్ పాల్గొన్నారు.

బొంరాస్‌పేట్: పేదల సొంతింటి కల కాంగ్రెస్‌తోనే సాకారం అవుతుందని కాంగ్రెస్ నాయకులు అన్నారు. బుధవారం బొంరాస్‌పేట్ మండలంలోని బుర్రితండా, కొత్తూర్ గ్రామాల్లో లబ్ధిదారులకు ప్రొసీడింగ్ కాపీలు అందించారు. అనంతరం ఇంటి నిర్మాణాలకు అధికారులతో కలిసి ముగ్గు పోశారు. త్వరితగతిన ఇంటి నిర్మాణాలను పూర్తి చేయాలని, ప్రభుత్వం విడతల వారీగా డబ్బులు అందజేస్తుందని తెలిపారు.

చౌడాపూర్: మండలంలోని పలు గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు భూమిపూజ చేశారు. లబ్ధిదారులకు ప్రొసీడింగ్‌లను అందించారు. అర్హులందరికీ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అశోక్‌కుమార్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ నాగరాజు, వెంకటయ్యగౌడ్, సలీమ్, పంచాయతీ కార్యదర్శి చంద్రకాంత్, మాజీ సర్పంచ్ అనంత్‌రెడ్డి, రాజు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య

సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

నవాబుపేట, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. బుధవారం మండలంలోని చించల్‌పేట్ గ్రామంలో అధికారులు రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ సదస్సుల్లో రైతులు భూ సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. అనంతరం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పలువురు లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. స్థానిక ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ బుచ్చయ్య, డిప్యూటీ తహసీల్దార్ శ్రీలత, ఆర్ఐ రాజు, పీఏసీఎస్ చైర్మన్ రామ్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ రాథోడ్ గీతా సింగ్, కాంగ్రెస్ నాయకులు తలారి ప్రభాకర్, కోఆప్షన్ మాజీ సభ్యుడు ఇక్బాల్, ప్రధానోపాధ్యాయుడు పాండు పాల్గొన్నారు.

ఫర్టిలైజర్ షాప్ యజమానికి షోకాజ్ నోటీసు

ధారూరు, జూన్18(ఆంధ్రజ్యోతి): ధారూరులోని తుల్జాభవాని ఫర్టిలైజర్ దుకాణం యజమానికి వ్యవసాయ అధికారులు షోకాజ్ నోటీసు జారీ చేశారు. మండల కేంద్రంలోని తుల్జాభవానీ ఫర్టిలైజర్ దుకాణంలో ఈ నెల 13న విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ మదన్‌మోహన్‌రెడ్డి, తహసీల్దార్ గంగాప్రసాద్ తనిఖీ చేసిన విషయం తెలిసిందే. కాగా, ఈ తనిఖీల్లో ఫర్టిలైజర్ దుకాణంలో అనుమతులు లేకుండా విక్రయిస్తున్న 16 పత్తి విత్తన ప్యాకెట్లను, క్రిమిసంహారక మందులను గుర్తించారు. ఎరువులు విక్రయాల నిల్వ, అమ్మకం వివరాలు సక్రమంగా లేవని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తనిఖీ వివరాలను ఏవో సూర్యప్రకాష్‌కు సమర్పించి చర్యలు తీసుకోవాలని సిఫారసు చేశారు. ఈ నివేదికపై వికారాబాద్ ఇన్‌చార్జి ఏడీఏ రాథోడ్ శంకర్‌నాయక్ తుల్జాభవానీ ఫర్టిలైజర్ దుకాణం యజమానికి సంజీయిషీ నోటీసు జారీ చేసి 6ఏ కింద కేసు నమోదు చేశారు.

పెంచిన బస్ పాస్ చార్జీలను వెంటనే తగ్గించాలి

ఘట్‌కేసర్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): పెంచిన బస్‌పాస్ చార్జీలను వెంటనే తగ్గించాలని ఎస్ఎఫ్ఐ ఘట్‌కేసర్ మండల అధ్యక్షుడు అనిల్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఘట్‌కేసర్‌లో విద్యార్థులతో కలిసి నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బస్ పాస్ చార్జీల పెంపుతో పేద, మధ్య తరగతి విద్యార్థులపై భారం పడుతున్నదని ఆరోపించారు. నాయకులు నీరజ్, యశ్వంత్, శివ, శ్రీరాం, భాను, ప్రశాంత్, గోపి పాల్గొన్నారు.


పెద్దేముల్: మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఉప్పరి రమేశ్

మోదీ నాయకత్వంలో భారత్ అభివృద్ధి

పెద్దేముల్, జూన్18(ఆంధ్రజ్యోతి): నరేంద్రమోదీ నాయకత్వంలో భారతదేశం వేగంగా అభివృద్ధి చెందుతున్నదని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఉప్పరి రమేశ్ పేర్కొన్నారు. మండలంలోని మదనంతాపూర్ గ్రామంలో బుధవారం బీజేపీ మండల అధ్యక్షుడు వీరేశం ఆధ్వర్యంలో వికసిత్ భారత్ కార్యక్రమంలో భాగంగా రచ్చబండ నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి బంటారం భద్రేశ్వర్, రమ్యానాయక్, దొడ్డ సందీప్‌కుమార్, వెంకట్‌రెడ్డి, శివరాజ్, లొంకమహిపాల్, ప్రవీణ్, యాదయ్యగౌడ్, భూమె నర్సింహులు పాల్గొన్నారు.

ప్రతి పౌరుడికి కేంద్ర పథకాలు

నవాబుపేట: కేంద్ర ప్రభుత్వ పథకాలు ప్రతీ పౌరుడికీ చేరాయని బీజేపీ జిల్లా నాయకులు జగన్, ప్రభాకర్‌రెడ్డి అన్నారు. 11 ఏళ్ల సుపరిపాలన వికసిత్ భారత్‌లో భాగంగా బుధవారం నవాబుపేట మండల కేంద్రంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి స్థానిక ప్రభుత్వ పాఠశాల, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణల్లో మొక్కలు నాటారు. నాయకులు ప్రభాకర్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, లక్ష్మణ్, శివ ప్రభు, ఆంజనేయులు, రాంరెడ్డి, మణికంఠరెడ్డి పాల్గొన్నారు.

సర్కారు బడిలో విద్యార్థులకు అడ్మిషన్లు

కులకచర్ల, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలను పిల్లల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని ఉపాధ్యాయులు కోరారు. బుధవారం కులకచర్ల మండలంలోని బండవెల్కిచర్ల గ్రామంలో ప్రైవేట్ పాఠశాలలో చదువుతున్న ఆరుగురు విద్యార్థులను తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలలో చేర్పించారు. ప్రభుత్వ పాఠశాలల్లోను మెరుగైన విద్య లభిస్తుందని ఉపాధ్యాయులు తెలిపారు. పాఠశాలల బలోపేతానికి ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని కోరారు.

వాటర్ బాటిల్స్ పంపిణీ

తాండూరు రూరల్, జూన్ 18, (ఆంధ్రజ్యోతి): మల్లికార్జున అప్పాజీ జన్మదినాన్ని పురస్కరించుకొని తాండూరు మండలం చిట్టిఘనాపూర్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు వాటర్ బాటిల్స్ పంపిణీ చేశారు. అప్పాజీ సేవా సమితి ఆధ్వర్యంలో పాఠశాలలో కేక్ కట్ చేసి విద్యార్థులకు వాటర్ బాటిళ్లు అందజేశారు. కార్యక్రమంలో సేవాసమితి సభ్యులు, గ్రామ పెద్దలు ప్రభాకర్‌రెడ్డి, దర్శీది రవిశంకర్, సంగమేశ్వర్, వీరారెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు నర్సిరెడ్డి గ్రామస్తులు ప్రవీణ్ గౌడ్, దస్తప్ప గౌడ్, అనిల్ పాఠశాల ఉపాధ్యాయులు ప్రమోద్‌కుమార్, శశివర్ణ, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలో సామూహిక అక్షరాభ్యాసం

మోమిన్‌పేట్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామ్‌నాథ్‌గూడుపల్లి గ్రామంలో బుధవారం అంగన్‌వాడీ కేంద్రం చిన్నారులకు సామూహిక అక్షరభ్యాసం చేయించారు. ప్రధానోపాధ్యాయుడు మదన్, టీచర్లు చిన్నారులతో అక్షరాలు దిద్దించారు. ఈ సందర్భంగా టీచర్ అనిత మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలన్నారు. కేంద్రంలో అందించే పౌష్టికాహారం గురించి అవగాహన కల్పించారు. అంగన్‌వాడి కేంద్రాల్లో చిన్నారులకు పాఠ్యపుస్తకాలు, దుస్తులు, పౌష్టికాహారం అందిస్తున్నట్లు పేర్కొన్నారు.

బీఆర్ఎస్‌లోకి కాంగ్రెస్, బీజేపీ నేతలు



బీఆర్ఎస్‌లో చేరుతున్న కాంగ్రెస్, బీజేపీ కార్యకర్తలు

దుద్యాల, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కుదురుమళ్ల గ్రామానికి చెందిన 50 మంది కాంగ్రెస్, బీజేపీ నుంచి బుధవారం మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. మండలంలోని గౌరారం గ్రామంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ఆరు గ్యారంటీల పేరుతో ప్రజలను మభ్యపెట్టిందని ఆరోపించారు. ప్రస్తుతం స్థానిక సంస్థల ఎన్నికలు ఉండటంతో రైతు భరోసా నిధులు విడుదల చేస్తుందన్నారు. కాంగ్రెస్ మోసపూరిత హామీలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ కార్యకర్తలకు సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండలాల అధ్యక్షులు చాంద్‌పాషా, కోట్ల యాదగిరి, దామోదర్‌రెడ్డి, నాయకులు కోట్ల మహిపాల్, మధుయాదవ్, నారాయణరెడ్డి, సురేశ్‌రాజ్, మడిగె శ్రీనివాస్, నరేశ్‌గౌడ్, బుగ్గప్ప, రవిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

భాష్యంపై చర్యలు తీసుకోవాలి

తాండూరు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): తాండూరులోని భాష్యం కళాశాలలో సంకల్ప్ అకాడమి, ఏసీ క్యాంపస్ పేరిట బోర్డు ఆఫ్ ఇంటర్మీడియట్ నిబంధనలకు విరుద్ధంగా నడిపిస్తూ అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని సబ్ కలెక్టర్‌కు బుధవారం పీడీఎస్‌యూ, కేఎన్‌పీఎస్, స్వేరో నాయకులు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ ఉమ్మడి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, కేఎన్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు చంద్రప్ప, స్వేరో జిల్లా ఉపాధ్యక్షులు శివకుమార్ మాట్లాడుతూ భాష్యం కళాశాలలో నిబంధనలకు విరుద్ధంగా నీట్, ఈఏపీ, సీఈటీ, ఐటీఐ, సీఏ సీపీటీ కోచింగ్ పేర్లతో అత్యధిక ఫీజులు వసూలు చేస్తు విద్యార్థులను మోసం చేస్తున్నారని ఆరోపించారు. యాజమాన్యంపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళన చేపడుతామని హెచ్చరించారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి


పాఠాలు బోధిస్తున్న మాజీ కౌన్సిలర్ మమతాజగన్‌మోహన్‌రెడ్డి

ఘట్‌కేసర్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు అన్నిరంగాల్లో రాణించేందుకు నిరంతరం శ్రమించాలని పోచారం మున్సిపాలిటీ మాజీ కౌన్సిలర్ బద్దం మమతా జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆమె మున్సిపాలిటీ పరిధిలోని అన్నోజిగూడ జడ్పీ స్కూల్‌ను సందర్శించి విద్యార్థులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆమె కొంత సేపు తరగతులను బోధించింది. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు విద్యలో రాణించేందుకు నిత్యం కృషి చేయాలన్నారు. ఉన్నత శిఖరాలను అధిరోహించడానికి కషపడి చదవాలన్నారు. నేడు ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని గుర్తు చేశారు. ఇంకా పాఠశాలలో ఏమైన సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు చర్యలు చేపడతానన్నారు. ప్రధానంగా ప్రవేటు పాఠశాలలకు దీటుగా విద్యార్థులను తీర్చిదిద్దాలని ఆమె ఉపాధ్యాయులను కోరారు.

రేణుకా ఎల్లమ్మ ఆలయ హుండీ లెక్కింపు

తాండూరు రూరల్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తెలంగాణ-కర్ణాటక సరిహద్దులోని కొత్లాపూర్ రేణుక ఎల్లమ్మ ఆలయ ఉత్సవాలు మే 12వ తేదీ నుంచి జూన్ 13వ తేదీ వరకు కొనసాగాయి. ఈ జాతరలో భక్తులు హుండీలో వేసిన కానుకలను మోమిన్‌పేట్ మండలం భూచన్‌పల్లి ఈవో శాంత్‌కుమార్, నవీన్ రెడ్డి ఆధ్వర్యంలో రేణుక ఎల్లమ్మ ఆలయ ఈవో శేఖర్‌గౌడ్ అధ్యక్షతన ఆలయ చైర్మన్ పట్లోళ్ల నవీన్‌రెడ్డి ఆధ్వర్యంలో హుండీ లెక్కించారు. ఈ హుండీలో రూ.4,47,053 నగదుతోపాటు బంగారు, వెండి కానుకలు ఉన్నాయి. ఈ డబ్బులను ఆలయ కమిటీ చైర్మన్ ట్రస్ట్ సభ్యుల సమక్షంలో బ్యాంకులో డిపాజిట్ చేశారని ఈవో తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు బైండ్ల రాజు, లాలయ్యగౌడ్, శాంతప్ప, లల్లా నాయక్, చెవిటి లక్ష్మి, కుండలి ఈశ్వరమ్మ, ఆలయ పూజారి శ్రీనివాస్, రవి తదితరులున్నారు.

భూ సమస్యల పరిష్కారానికి కృషి


మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్

కొడంగల్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): భూ భారతి రెవెన్యూ సదస్సుల్లో స్వీకరించిన దరఖాస్తులను పరిశీలించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని తాండూర్ సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్ సూచించారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ విజయ్‌కుమార్, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొడంగల్ మండలంలోని 18 గ్రామాల్లో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో అధికారులు స్వీకరించిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

భూ భారతితో సమస్యలు పరిష్కారం

కులకచర్ల, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): భూ భారతి ద్వారా భూ సమస్యలు పరిష్కారం అవుతాయని మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్.ఆంజనేయులు, సొసైటీ చైర్మన్ మొగులయ్య అన్నారు. బుధవారం మండలంలోని ముజాహిద్‌పూర్‌లో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో వారు పాల్గొన్నారు. రైతుల నుంచి అధికారులు దరఖాస్తులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మనోహరచక్రవర్తి, డీసీసీ ఉపాధ్యక్షుడు భీమ్‌రెడ్డి, ఆర్ఐలు ఖాజా, రాఘవేంద్రచారి తదితరులు పాల్గొన్నారు.


లబ్ధిదారులకు చెక్కును అందజేస్తున్న ఎంపీ ఈటల రాజేందర్

సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం: ఈటల

మేడ్చల్ టౌన్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): సీఎంఆర్ఎఫ్ పేదలకు వరమని మేడ్చల్ - మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. బుధవారం గుండ్లపోచంపల్లి గ్రామానికి చెందిన బండారి నరేశ్‌కు ఆయన రూ.30వేల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేశారు. కార్యక్రమంలో గుండ్లపోచంపల్లి మాజీ కౌన్సిలర్ దొడ్ల మల్లికార్జున్ ముదిరాజ్, గుండ్లపోచంపల్లి సకృతి డెలైట్ అసోసియేషన్ సభ్యులు పలు సమస్యల పరిష్కారం కోరుతూ ఎంపీ ఈటలకు వినతి పత్రం అందించారు.

ఈటలను కలిసిన నేతలు

కొత్తగా ఎన్నికైన బీజేపీ మేడ్చల్ మున్సిపల్ నూతన కమిటీ సభ్యులు ఎంపీ ఈటల రాజేందర్‌ను మర్యాద పూరకంగా కలిశారు. కార్యకర్తలు పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని ఎంపీ సూచించారు. పార్టీ పట్టణ అధ్యక్షురాలు శైలజ ఉన్నారు.

నిందితులను అరెస్ట్ చేయాలి

తాండూరు రూరల్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): దళిత యువకుడి పెళ్లి భరాత్‌ను అడ్డుకున్న వారిని అరెస్టు చేయడంలో పోలీసులు నిర్లక్ష్యం వహిస్తున్నారని కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.స్కైలాబ్ బాబు ఆరోపించారు. బుధవారం తాండూరు మండలం బెల్కటూరులో అంబేద్కర్ చౌక్ వద్ద ప్రజా సంఘాల నాయకులతో కలిసి మాట్లాడారు. బెల్కటూర్‌లో దళితుడి పెళ్లిభారాత్‌ను అడ్డుకున్నారని ఫిర్యాదు చేసినా తాండూరు డీఎస్పీ నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. అడ్డుకున్న వారిని మూడురోజుల్లో అరెస్టు చేయకపోతే నిరాహార దీక్షలు ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు మహిపాల్, శ్రీనివాస్, మల్కయ్య, బుగ్గప్ప, నర్సింహులు, కృష్ణ, బలరాం, నరేష్ పాల్గొన్నారు.